క్లుప్తంగా

స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కమిషనర్ సత్యవేణి ఆదేశాలిచ్చారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 21 అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. వేసవి దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు, దాత సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీ జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు, ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న పాల్గొన్నారు.

సమగ్ర పునరావాసం కోసం పోరాడాలి

ప్రకాశం నగర్: పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న 371 గ్రామాల ప్రజలకు పూర్తి నష్టపరిహారం, సమగ్ర పునరావాసం పొందేవరకూ నిర్వాసితులు ఐక్యంగా పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విక్రమ్ హాలులో రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ జరిగింది. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇల్లా రామిరెడ్డి రైతుకూలీ సంఘం జెండాను ఎగుర వేసి మహాసభలను ప్రారంభించారు. ఇటీవల ప్రచురించిన ×జీవించే హక్కు కోసం, పునరావాసం కోసం, గిరిజనుల పోరాటం – పోలవరం ముంపు ప్రాజెక్టు గ్రామాల ప్రజల ఆందోళన× అనే పుస్తకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ ఆవిష్కరించారు. ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఐదు లక్షల మందికి పైగా ఉన్నారని, వీరిలో 4115 కాంటూరు వరకు ఉన్నవారికి పునరావాసాన్ని పరిమితం చేసి, మిగిలిన నిర్వాసితులను వదిలివేయడం సరికాదన్నారు.

చైతన్య విద్యార్థుల విజయభేరి



ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలో విజయం సాధించిన చైతన్య విద్యార్థులు

కంబాలచెరువు: ఐఎన్‌టీఎస్‌వో లెవెల్ 2 పోటీ పరీక్షలో సీతంపేట చైతన్య స్కూలు విద్యార్థులు విజయం సాధించారని ప్రిన్సిపాల్ జె.శశిధర్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ పరీక్షకు 90 మంది విద్యార్థులు హాజరు కాగా, తమ స్కూలు విద్యార్థులు మూడు, నాలుగు, ఐదు బహుమతులు గెలుచుకున్నారన్నారు. వారితో పాటు 29 మంది కన్సోలేషన్ బహుమతులతో పాటు 62 బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను చైతన్య విద్యాసంస్థల ఏజీఎం వైఎస్ శ్రీనివాస్, ఆర్ఐ వై.రామాంజనేయులు, కో ఆర్డినేటర్ జె.శ్రీనివాస్, డీన్ ఎం.మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

తాటాకిల్లు దగ్ధం

కడియం: మురమండ పంచాయతీ పరిధిలోని దొరగారితోట కాలనీలో సోమవారం పి.రమణమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. రమణమ్మ ఎప్పటి మాదిరిగానే ఉదయాన్నే కూలి పనులకు వెళ్లింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాటిని ఆర్పేందుకు చుట్టుపక్కల వారు ప్రయత్నించారు. స్థానికుల సమాచారం మేరకు మండపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం సంభవించిందని అంచనా. రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలను తెలుసుకున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

ప్రకాశం నగర్: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక క్వారీ మార్కెట్ సుబ్బారావు నగర్‌లో బత్తిన సుబ్బారావు సేవా సమితి వ్యవస్థాపకుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో బత్తిన సుబ్బారావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి టాస్ వేసి పోటీలను మొదలుపెట్టారు. కార్యక్రమంలో యువజన విభాగం నగర అధ్యక్షుడు పితాని రామకృష్ణ, బత్తిన సుబ్బారావు కుమార్తె మాటూరి లక్ష్మీచక్రవర్తి, కొత్త విజయలక్ష్మి, బాలమురళి, కాంతారామ్, సుభాషిణి, ఏనుగుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

కొందరి నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం

- విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- అనేక పథకాల అమలు
- అయినా బడిబయటే కొందరు బాలలు



పుస్తకాలు అమ్ముతున్న బాలుడు

కంబాలచెరువు: నేటి బాలలే రేపటి పౌరులు. పౌరులు విద్యావంతులైతే ఆదేశం ఉన్నతస్థానంలో ఉంటుంది. అందుకే పాలన విధానంలో అన్నిస్థాయిల్లో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తారు. రాష్ట్రంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. అంగన్‌వాడీ స్థాయిలో చిన్నారులకు గోరుముద్ద నుంచి కళాశాల స్థాయిలో విద్యాదీవెన పథకం, అనంతరం విదేశీ విద్య వంటి ఎన్నో పేదవారికి అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం బృహత్తరంగా అమలు చేస్తోంది. ఏ విద్యార్థీ చదువుకోకుండా ఉండకూడదనే ఆశయంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్చడం, డ్రాప్ అవుట్స్ లేకుండా పర్యవేక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయితే కొందరు తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణం ఆ లక్ష్యం నీరుగారుతోంది. బలపం పట్టాల్సిన బాలలు బరువులు మోస్తున్నారు. బాలకార్మికులుగా, భిక్షగాళ్లుగా, రోడ్లపై చిన్న చిన్న వస్తువులు అమ్మేవారిగా, వీధి బాలలుగా మిగులుతున్నారు.

తక్కువ జీతానికి లభిస్తారని..

ఇటీవల రోడ్లపై, షాపింగ్ మాళ్ల వద్ద కొందరు పిల్లలు పుస్తకాలు, ఆట వస్తువులు అమ్ముతూ కనిపిస్తున్నారు. అక్కడకు వచ్చేవారి వెంట పడుతూ, తమ చేతిలో వస్తువులు కొనుగోలు చేయాలని బతిమలాడుతున్నారు. అయితే ఆ వస్తువులు తమకు వద్దని చెప్పినా, తినడానికి ఏమైనా ఇచ్చినా తీసుకోవడం లేదు. తమ చేతిలో వస్తువులనే తీసుకోవాలని ప్రాధేయపడుతున్నారు. దీంతో జాలిగా మనం ఆ వస్తువులను కొనుగోలు చేస్తుంటాం. అయితే ఈ విక్రయాలు మాటున మాఫియా నడుస్తున్నట్లుగా తెలుస్తోంది. కొందరు హోల్‌సేల్ వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాలకు చిన్నారులను ఉపయోగించుకుంటున్నారు. వీరితో పుస్తకాలు అమ్మించి ఎంతో కొంత ముట్టజెప్పుతున్నారు. విక్రయించేది చిన్నపిల్లలు కావడంతో వీరిపై జాలితో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిన్నారుల తల్లిదండ్రుల ఆర్థిక బలహీనతను ఆసరాగా తీసుకుని ఈ విధంగా చేస్తున్నారు.

పనివాళ్లుగా..

కొన్ని మెకానిక్ షెడ్లలోనూ మిఠాయి దుకాణాల్లోనూ చిన్నారులను పనిలో పెట్టుకుంటున్నారు. దీంతో వారి చదువు పక్కదోవ పడుతోంది. చిన్నారులు సంపాదించే యంత్రాలుగా తయారవుతున్నారు. చిన్న వయసులోనే పనిలోకి రావడంతో వారి ప్రవర్తనలో మార్పు వస్తోంది. చెడు అలవాట్లకు బానిసలు కావడం, దురలవాట్లకు లోనుకావడం జరుగుతోంది. దీంతో కొందరు బాలనేరస్తులుగా మారుతున్నారు.

వందమంది బాలల గుర్తింపు

రోడ్లపై భిక్షాటన చేస్తున్న చిన్నారులను చైల్డ్‌లైన్ అధికారులు గుర్తిస్తున్నారు. ఈ ఏడాదిలో సుమారు 100 మంది వరకు బాలలను పట్టుకుని సీడబ్ల్యూసీకి అప్పగించారు. అలాగే పాఠశాలలకు వెళ్లకుండా రోడ్లపై వివిధ వస్తువులు అమ్ముతున్న వారిని, బడిఈడు పిల్లలను గత ఆరు నెలల క్రితం 3 వేల మందిని గుర్తించగా, ఆ సంఖ్య ప్రస్తుతం 1300కు తగ్గింది.

ప్రత్యేక డ్రైవ్‌లు

బాలల పరిరక్షణకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నాం. లేబర్ డిపార్ట్‌మెంట్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీసులతో సంయుక్తంగా ప్రత్యేక నిఘా పెట్టి వారిని పట్టుకుంటున్నాం. కొందరిని అంగన్‌వాడీల్లో చేర్చుతున్నాం. పెద్ద పిల్లలైతే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పాఠశాలలకు పంపుతున్నాం. బాలలతో భిక్షాటన చేయించడం నేరం.

– డి.శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్

24న కాకినాడలో ఫొటో మినీఎక్స్‌పో



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లు బాబీ

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ జిల్లా ది ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న కాకినాడలోని కుసుమ సత్య ఫంక్షన్ హాల్లో నిర్వహించే సెమినార్ అండ్ ఫొటో మినీఎక్స్‌పోను జయప్రదం చేయాలని రాజమండ్రి జోన్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ కోరారు. ఈ మేరకు సోమవారం ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అల్లు బాబీ మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు తోట చంటిబాబు రాజమండ్రి జోన్ అధ్యక్షులు మయూరి శివ, ఎస్ఎస్ శేఖర్, గౌరవ సలహాదారులు రావు అండ్ రావు, వీడియో గ్రాఫర్ యూనియన్ ప్రెసిడెంట్ గోపి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి



గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- ఉత్సాహంగా గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: సమస్యలు కనిపిస్తే, తక్షణమే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 43వ డివిజన్ విద్యానగర్ గౌతమీ నేత్రాలయం వీధి నుంచి గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్‌కు ఆదేశించారు. వర్షాకాలం వస్తే డ్రైనేజీలో మురుగు నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరుతోందని స్థానికులు తెలిపారు. తనకు వేలిముద్ర పడకపోవడం వల్ల రేషన్ ఇవ్వడం లేదని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేయగా.. త్వరలోనే రేషన్ అందేలా చేస్తానని మాట ఇచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 43వ డివిజన్ వైఎస్సార్ ఇన్‌చార్జి హసీనా బేగం, ఓంకార్, హసన్, ఆర్ఎంసీ ఈఈ కనకారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని రూరల్ తహసీల్దార్ పైడి చిన్నారావు అన్నారు. ధాన్యం కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం హుకుంపేటలోని సొసైటీ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా ఓపెన్ మార్కెట్‌లో వచ్చినప్పుడు అమ్ముకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. సమావేశంలో గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఎం.సాయి శరణ్య, రాహుల్, ఎం.దీపిక, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నాయకుల ధర్నా



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న రుద్రరాజు

సీటీఆర్ఐ: అదానీ అక్రమ ఆర్థిక వ్యవహారాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు సత్యాగ్రహ దీక్ష చేసేందుకు వచ్చారు. ముందుగా కలెక్టరేట్ వద్దకు నిరసన ప్రదర్శనగా వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. లోపలకి వెళ్లడానికి అనుమతి లేదని, వినతి పత్రం ఇవ్వడానికి ఆరుగురిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిడుగు రుద్రరాజు తదితరులు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మార్టిన్ లూథర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

కంబాలచెరువు: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఉద్యోగులకు వేతనాలను వెంటనే చెల్లించాలని నగర ఏపీ ఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఆసుపత్రి పరిధిలోని నర్సింగ్ స్టాఫ్, మినిస్టీరియల్, పారా మెడికల్ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు లేవన్నారు. త్వరలో వేతనాలు మంజూరు చేయడానికి చర్యలు చేపడతామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నగర సంఘం సహాయ అధ్యక్షులు వేణుమాధవరావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ప్రతాప్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ధర్నా

కడియం: ధాన్యం కొనుగోలుపై ఆంక్షలు తొలగించాలని, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.సుజాతకు వినతిపత్రం అందించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ఎంపీ భరత్ విశేష కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా శ్రీనగేష్

- ఆదిరెడ్డి అప్పారావు విమర్శలు అర్థరహితం
- ధ్వజమెత్తిన నక్కా శ్రీనగేష్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పైనా, ఎంపీ మార్గాని భరత్‌రామ్ పైనా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఎంపీ భరత్ రామ్ చేస్తున్న అభివృద్ధిపై ఆదిరెడ్డి అప్పారావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నగరంలో ఎంపీ భరత్ రామ్ చేసిన అభివృద్ధి అభినందనీయమన్నారు. దాన్నిచూసి ఓర్వలేని ఆదిరెడ్డి అప్పారావు విమర్శలు చేయడం సరైన విధానం కాదన్నారు. బీసీ నేత అయిన ఆదిరెడ్డి అప్పారావుకు జగన్ ఎమ్మెల్సీ సీటు ఇస్తే రాజకీయ స్వార్థం కోసం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీలోకి కనీసం రాజీనామా చేయకుండా వెళ్లడాన్ని ఏమంటారో చెప్పాలన్నారు. టీడీపీ పరంగా రాజమహేంద్రవరంలో ఎవరికి టికెట్ ఇస్తారో ముందు తేల్చుకోవాలన్నారు. ఆదిరెడ్డి కుటుంబానికి సీటు లేదని చంద్రబాబు నాయుడు చెప్పకనే చెప్పారన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుచుకున్న స్థానాలు కేవలం రెండో ప్రాధాన్యత ఓటుతో గెలిచినవేనని, అది అసలు గెలుపేకాదన్నారు. నల్లా చానల్ ఎగువ ప్రాంతంలో ఇన్‌టేక్ పాయింట్ ఏర్పాటు చేసి నగర ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, గుత్తుల భాస్కర్, యజ్జిరపు మరిడియ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మేటివ్ పరీక్షలపై దృష్టి సారించాలి

కడియం: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న సమ్మేటివ్ –2 పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి తిరుమలదాస్ ఆదేశించారు. సోమవారం ఆయన కడియం ఎంఆర్‌సీకి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. మంగళవారం ఒకేషన్ పరీక్ష జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం ఇన్నీసుపేట బాలికోన్నత పాఠశాలలో ఈనెల 19 నుంచి 26 వరకు మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఇందుకు డ్యూటీలు కేటాయించిన ఉపాధ్యాయులు కచ్చితంగా హాజరు కావాలన్నారు. ఎండ తీవ్రత కారణంగా ఉదయం 11.15 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజన పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. కడియంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈవో వి.లజపతిరాయ్ ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఇనుగంటివారిపేటలోని మదీనా మసీదులో సోమవారం ముస్లింలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముస్లిములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లిముల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఇనుగంటివారిపేటలో రూ.70 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ –2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, నియోజకవర్గం బూత్ కమిటీల అధ్యక్షుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, సర్పంచ్ సత్యం రాంపండు, కవల కృష్ణమూర్తి, రంది భారతిదేవి, అంబటి రాజు పాల్గొన్నారు.

సండే వేళ.. సందడి భళా..

- మెయిన్‌రోడ్డులో సండే బజార్
- తక్కువ ధరకే వస్తువులు
- తరలివస్తున్న ప్రజలు





సండే బజార్‌లో ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల వస్తువులు, దుస్తులు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే కొనుగోలుదారులతో రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డు నిత్యం కళకళలాడుతూ ఉంటుంది. అయితే ఆదివారం వచ్చిందంటే సండే బజార్ పేరుతో వివిధ రకాల వస్తువుల షాపులతో కళకళలాడుతుంది. షోరూంలలో దొరికే అన్ని రకాల వస్తువులు సండే బజార్‌లో తక్కువ ధరకు లభ్యమవుతుండటంతో నగర ప్రజలు వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

రెండు కిలోమీటర్ల మేర..

ప్రధానంగా కోటగుమ్మం జంక్షన్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర మెయిన్‌రోడ్‌కు ఇరువైపులా హోటల్ జగదీశ్వరీ వరకు షాపులు ఏర్పాటు చేస్తున్నారు.

షోరూంలో దొరికే దుస్తులు మొదలుకుని డెకరేటివ్ ఐటమ్స్, వివిధ వాచీలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, బెల్టులు, దుస్తులు, టెడ్డీ బేర్స్, ఫ్యాన్సీ వస్తువులు, లేడీస్ రోల్డ్‌గోల్డ్ వస్తువులు, వాటర్ బాటిళ్లు, షూష్, పాత వస్తువులు, పూలకుండీలు, మొబైల్ కవర్లు, డోర్ కర్టెన్లు.. ఇలా అన్ని రకాల వస్తువులు తక్కువ ధరకు లభిస్తున్నాయి. ఆదివారం మెయిన్ రోడ్‌లో దాదాపు 80 శాతం షాపులు మూసివేసి ఉంటాయి. అయినా సండే బజార్ పేరుతో సుమారు 100కు పైగా షాపులు ఏర్పాటు చేస్తున్నారు.

తక్కువ ధర



సండే బజార్‌లో వస్తువులు తక్కువ ధరకు దొరుకుతున్నాయి. నాణ్యత బాగుంటుంది. షోరూంలో దొరికే వస్తువులు ఇక్కడ ఓపెన్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. పేదవర్గాలకు ఎంతో అనుకూలంగా ధరలు ఉంటున్నాయి. ప్రతి ఆదివారం సండే మార్కెట్‌కు వస్తుంటాం.

– దారపు శ్రీదేవి, రాజమహేంద్రవరం

అందుబాటులో..



ఓపెన్ లైటింగ్‌లో వస్తువులను చూడడం వల్ల ముఖ్యంగా దుస్తుల రంగులు స్పష్టంగా తెలుసుకోవచ్చు. నచ్చిన రంగులను కొనుగోలు చేయవచ్చు. అందుబాటులో ధరలు ఉండడం వల్లనే ఆదివారం మెయిన్‌రోడ్‌లో వస్తువులు కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నాం.

– శైలజ, రాజమహేంద్రవరం

అత్యవసర పనులకు అనుమతులివ్వండి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అమరావతిలో మంత్రి, అధికారులకు వినతి



అమరావతిలో ఉన్నతాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని సంబంధితశాఖ మంత్రి, అధికారులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కోరారు. రూ.85.17 కోట్లతో కూడిన ఆరు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సమర్పించారు. భారీ వర్షాల సమయంలో ఏర్పడే ముంపుతో పాటు వరదల నుంచి పంటపొలాలను కాపాడుకోవడానికి ఈ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితకు వివరించారు. అనంతరం ఆ శాఖ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలుసుకుని గోదావరి వరదలతోపాటు కాలువలు, చెరువుల్లోని ముంపునీటి ప్రవాహాల కారణంగా నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, కలుగుతున్న నష్టాలను తెలియజేశారు. సీతానగరం మండలం బొబ్బిలంక వద్ద ఏజీఎల్‌బీ ఏటిగట్టుపై 18.400 కి.మీ.వద్ద ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్‌ని ఆధునీకరించాలన్నారు. బొబ్బిలంక – జాలిమూడి నడుమ అఖండ గోదావరి ఏటిపట్టుపై 19.00 కి.మీ నుంచి 20.60 కి.మీ నడుమ కోతకు గురవుతున్న ప్రాంతాలలో రాళ్లతో రక్షణ ప్లాట్‌ఫాం నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలన్నారు. మునికూడలిలో గోదావరి ఎడమగట్టుపై 22.400 కి.మీ నుంచి 23.400 కి.మీ వరకు కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ ప్లాట్‌ఫాం నిర్మించాలన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని బురద కాలువ నుంచి రాజు సప్లయ్ చానల్‌కు అత్యవసరంగా రక్షణ పనులు చేపట్టాలని కోరారు. ఏటా జూలై –నవంబర్ మాసాల నడుమ బురద కాలువకు వచ్చే వరదతో శ్రీరంగపట్నం ముంపుబారిన పడుతోందన్నారు. మునగాలలో బుద్దాయి కాలవ (నాగబుచ్చన్న ట్యాంకు సర్‌ప్లస్ ఛానల్)కు అత్యవసర పనులు చేపట్టాలన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులోని శిలారామయ్య చెరువు, ఈడిమండలం చెరువు, ఎర్రపరిమిగొయ్యి చెరువులకు శాశ్వత కల్వర్టులను నిర్మించాలన్నారు. దీనివల్ల 300 ఎకరాలను ముంపుబారి నుంచి కాపాడవచ్చన్నారు. వీటితోపాటు ఇనగంటివారిపేటలో రూ.70 లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణంతోపాటు రూరల్ మండల పరిధిలోని పొట్టిలంక వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు చేశారు.

108లో ప్రసవం



పసిబిడ్డను చూపుతున్న ఈఎంటీ దేవి

అనపర్తి: బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన నల్లబోతుల దుర్గ సోమవారం 108 అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. నల్లబోతుల దుర్గకు పురిటి నొప్పులు రావడంతో కాపవరానికి చెందిన ఆశ వర్కర్ నీలిమ 108కు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది దుర్గను అంబులెన్స్‌లో ఎక్కించుకుని అనపర్తి ఏరియా ఆసుపత్రికి బయలు దేరారు. అయితే దుర్గకు ప్రసవ వేదన ఎక్కువవ్వడంతో అంబులెన్స్‌లో ఈఎంటీ దేవి, పైలట్ ఆదినారాయణలు ఆమెకు ప్రసవం చేసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి



గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య

గోపాలపురం: మెట్టప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకుకు తగిన గిట్టుబాటు ధరలు కల్పించాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య కంపెనీ బయ్యర్లకు సూచించారు. ఆయన రీజనల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది మొదటి సారిగా గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. గత ఏడాది సరాసరి ధరలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురైనట్లు వివరించారు. పొగాకు బోర్డు నిర్దేశించిన 47.80 మిలియన్ కిలోలకు గానూ రైతులు 53 మిలియన్ పొగాకు ఉత్పత్తి చేసినట్టు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 5.23 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరిగాయని, అందులో కిలో సరాసరి ధర రూ.196.62 ఉన్నట్లు ఆర్ఎం పేర్కొన్నారు. రైతులు గ్రేడింగ్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పొగాకులో అవశేషాలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ గ్రేడింగ్ అధికారిణి టి.హేమశ్మిత,బోర్డు అధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్, ఇల్లూరి పెంటరాజు, కార్యదర్శి ఇల్లూరి రాంబాబు, ఉపాధ్యక్షుడు ముల్లంగి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.